# ఇంద్రధనుస్సు

చిట్టారెడ్డి సూర్యకుమారి

బి. ఏ. పట్టా పుచ్చుకొని యూనివర్శిటీ నుంచి బయటికి వచ్చిన గోపీచంద్ (గోపన్న) శూరునిలా ఉత్సాహంగా వున్నాడు. పదిలంగా పట్టుకొన్న డిగ్రీతో యే ఆఫీసుకో కాలికొద్దీ పరుగెత్తాలని, చకచకమని ఆఫీసర్ ఉద్యోగం చేయాలని ఉంది. కాని ఆ పని ఇప్పుడే జరిగేది కాదు గనుక నల్లగౌను విప్పి భుజాన వేసుకొని ఫోటో స్టుడియో వైపు మళ్ళాడు. నల్లగౌను పలకల టోపీ, చేతిలో బి.ఏ. డిగ్రీతో ఫోటోలో పడి ఆ ఫోటోకి ఫ్రేమ్ కట్టించి తండ్రికి ఇవ్వాలి. ఆ ఫోటోని తండ్రి మునయ్య ఏంచేస్తాడో గోపీకి తెలుసు.

ఇస్త్రీ బల్ల దగ్గర గోడకి వ్రేలాడ తీసి గర్వంగా చూస్తూ బట్టలపై ఇస్త్రీ పెట్టెను తోముతూ "ఈ రెక్కల కష్టం ఎన్నాళ్ళో- గోపన్న గవర్నమెంటు ఉద్యోగంచేసి నెల తిరిగేసరికి లెఖ్ఖతెచ్చి దోసిట్లో పొయ్యడూ" అంటాడు. అప్పుడు బటల గుట్టలో నుంచి జావి చొప్పున వేరుచేస్తున్న మునయ్యభార్య- "అయ్యో సంబడం" అని ఎగతాళిగ అన్నా ఆ గొంతులో ఆశ లేకపోలేదు. మైలబట్టల మూటకి చేరగిలబడి ఎండకి చౌడుకి ఎర్రబారిన వెంట్రుకలని దులిపి ముడేసుకుంది. తలలో నుండి రాలిన ఇసుక రేణువులు మెడకు పట్టిన చెమటతో అతుక్కు పోయాయి. లోతుకు పోయిన పొట్టలో పేగులు గుర్రుమన్నాయి. అంతవరకు చద్దితినలేదని గవనం చేసుకుంది. రేతిరి మిగిలిన పిడచ మెతుకుల్లో నీళ్ళు పోసిన పిడత అందుకొని బయట పొయ్యిగడ్డమీదున్న వుల్లిపాయ నంజుకొంటానికి తీసుకుంది. అడపా దడపా బాపనమ్మోరు పెట్టే ఆవకాయ ముక్కను గవనం చేసుకుంటు వుల్లిగడ్డను కసుక్కుమని కొరికింది. "ఆ ముండమోపి అమ్మాయి ఏడుతా వుండాది. కూతంత పచ్చడి పడేయ్యమని అడగటానికే నోరురాలా"

పాపం చెయ్యికి ఎముకలేదు దానం సేసీసేయ్య" అది తనా ఆడమనిషి, ఎవరిగురించి చెప్పుతుందో తనకెరుకే. తండ్రి నేడు కదా అని- కట్టపడి, నోరు కట్టేసుకొని చదివించింది కొడుకుని. ఉద్యోగం అయింది కొమ్ములొచ్చాయి-

(పెళ్ళాం వచ్చింది). అత్తకి, కోడలికి పొత్తు కుదరలేదు. కన్నతల్లిని యాత్రలకు పొమ్మనో మరెక్కడకో పొమ్మని పయాణం కట్టమంటాడు. అందుకే అన్నారు పెళ్ళాం బెల్లం తల్లి అల్లం అయింది అని. ఈ రోజుకి మనమూ అట్టా అనుకుంటూ వుంటే గోపన్న గవసం వచ్చాడు. వాడెట్టాటివాడో - అనుకోకూడదని సరిపెట్టుకున్నా, లోన మనస్సు వూరుకోదుగా - పుట్టి పెరిగిన ఈ ఇల్లు పనికిరాదంటాడు. కులవృత్తి మానేయమంటాడు. చాకలోళ్ళబ్బాయి అనుకుంటారని బిడియం ఊరినుంచి ఇంటికివస్తే రేతిరిపూటే వత్తాడు. బట్టల మూట నెత్తిన పెట్టుకొని వత్తుంటే టౌనులో ఎదురైనాడు - కన్నెత్తి చూడలా-గబగబ పక్కతోవన వెళ్ళి పోయిండు. "తర్వాత ఏంరా గోపన్నా మీ అయ్యను పలుకరించలేదూ-మెరక వీధిలో అగుపడ్డావటగా" అన్నది తల్లి - "ఏమో నేచూడలా" అబద్ధం ఆడేసాడు. ఆడు సెప్పింది సత్తెమే అయివుండాలే అని సరిపెట్టుకున్నాడు.

ప్రస్తుతం ఉల్లిపాయవాసన వూరిస్తుంది. కాని సద్దితింటం మానేశాడు. ఇప్పుడు పొద్దు పొడవకముందే ఆడు ఇడ్లెన్లూ - అరగ్లాసుడు టీ పుచ్చేసుకుంటాడు. కొడుకు కాలేజీ చదువుతుండోడు - ఆడిముందు సద్దితింటం సిగ్గేసింది.

"మరి కొడుకు సదువు అయిపోనాది గంద-మరేంటి సేసడు ! మఎంకేదో వుందటనే అదికూడ సదవతడా" అంది మునయ్య భార్య.

ఇత్తడి ఇస్త్రీపెట్టె ఇనుప చట్రం మీద నిలిపి చొక్కాలమీద నీళ్ళు చుక్కలు చిలకరిస్తూ రెక్కల్లో సత్తువ నేదు - ఆడికిసాల్లే - మిద్దింటి సుబ్బడు కూతుర్నిస్తానని కబురెట్టాడు - ఆడిచ్చే-రొఖంతో టవునులో ఇస్త్రీ బంకుపెడితే కరెంటు ఇస్త్రీపెట్టె పెడితే - ఎట్టావుంది నా అవిడియా ! "నీ అవిడియాలు బాగున్నాయి-నీకొడుకేటంటాడో-అపిల్ల నల్లగుంది. మొన్నఏటికాడ సూసినా - పని సరిగ్గా వచ్చినట్టులేదు.

"ఓయబ్బో నీ వెర్రగున్నావేంటి ? అది వుద్యోగతుడి భార్య అవుద్ది."

అలామునయ్యకొడుకు సదువుగురించి ఉద్యోగం గురించి-ఎన్ని రోజుల తరబడి పెళ్ళాంతోకాని, బంధువులతోకాని వూసులాడ కలడు.

* * *


గోపీచంద్ డిగ్రీ ఫోటోని గోడకి తగిలించాడు. రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు గడిచిపోతున్నాయి. ఆ ఫోటోని చూస్తుంటే ఇప్పుడు అనుభూతి కలగటంలేదు - మసిబారి ఎర్రగా మారింది. కుక్కిమంచంలో పడుకున్న గోపీచంద్ బూజు వ్రేలాడుతున్న చూరువెపుకు చూస్తున్నాడు. తాను పడుకున్న పూరికొంప గాలివానకి వొరిగింది. పక్కింటి గాడిద హృదయ విదారకంగా ఓండ్ర పెట్టుతున్నది. ఎక్కడో బిచ్చగాడు "మాదా కవళం" అంటున్నాడు. ఆ జానెడు పొటకొరకు ఎన్ని గుమ్మాలు ఎక్కి దిగాలో వాడు. ఉద్యోగం బిక్ష కొరకు వెళ్ళని చోటు లేదు. అడగనివారు లేరు. ఎక్కడి

కెళ్ళినా చుక్కెదురైంది. బయట అలికిడికి కన్నులు ప్రక్కకి తిప్పాడు. వీపుకున్న బట్టల మూటతో ఎందుకట్టెలా వున్న తల్లిని చూశాడు- మెడమీదనుంచి జార్చిన మూట ప్రక్కనే చతికిలపడ్డది. ఉస్సూరుమంటూ కాళ్ళు ముందుకు బార్లా చాచినది. టౌను నుంచి అయిదు మైళ్ళు నడచి వచ్చి వుంటుంది. ఇంట్లో వున్న గాడిదలు ఇంటర్వ్యూకి అమ్ముడు పోయాయి. ఇత్తడి ఇస్త్రీ పెట్టె కుదువకి పోయింది. వారి స్థితి శక్తి తనకు ధార పోశారు—కొడుకు ఉద్యోగస్తుడౌతాడని రంగుల ప్రపంచాన్ని వూహించుకున్నారు. కాని ఉద్యోగం అన్నమాట కంటికి కనిపిస్తున్న ఇంద్ర ధనుస్సు - వర్ణభ్రాంతి మాత్రమే ।

అతి చేరువలో సినిమాపాట వినవచ్చింది. గోపీచంద్ గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. చేతిలో ట్రాన్సిస్టర్- నోట్లో బీడి - చలువ బట్టల్లో వున్న వెంకన్నని చూచి - కాళ్లు పిసుక్కుంటున్న దల్లా ఆగి - వెంకా ఓ అర్థ రూపాయి ఇత్తావూ- మీ మామయ్య వచ్చాక సర్దుతా అంది.

ఇత్తాగాని-ఏంది గోపయ్యా అటా పడుకొన్నాడు. ఒంటో బాగు నేదా" పరామర్శగా లోనికి వచ్చి మంచంపై కాళ్ళవైపు కూర్చున్నాడు - రేడియో పాటలో వాడి మాటలు వినపడలేదు ఆమెకు - చెవి చూపలేదు అన్నట్లుగా చెయ్యి వూపింది. పొటగొత్తే అక్షరం రాదు వీడికి, వీడికి సిరి అబ్బింది. చెర స్వతి వున్న అబ్బిగాడికి ఉద్యోగం లేదు-యాడ వుంది నాయం అనుకొంది ఆమె.

బండెడు బట్టలు అవలీలగా బాది పెద్దపెద్ద బానల్లో ఉడకేసి ఆరేసాడు. తను చదువుకున్నవాడు, సెగలుగక్కే ఇస్త్రీపెట్టె పట్టుకోలేదు. ఒకప్పుడు చీదరించుకున్న వృత్తిని ఇప్పుడు చేద్దామనుకున్నా చేయలేడు. వెంకు మిద్దె కట్టాడు. ఇప్పుడు బట్టలు ఉతకడానికి పనివాళ్ళు - టౌనులో ఇస్త్రీసాపుల్లో వాడుంటాడు. రెంటికిచెడ్డ రేవడిలా వుంది తనపని గోపి మనస్సు కృంగిపోయింది. మెదడు వేడెక్కింది. వెంకు దగ్గర అప్పుగా తీసుకున్న రూపాయి నోటు గోపన్న చేతిలోవుంచి "అట్టెళ్ళి కాసిన్ని టీ నీళ్ళు తాగిరా అంది" గోపీ మనస్సు ద్రవించిపోయింది. ఉద్యోగంలేని తనమీద తల్లిదండ్రులకు పుట్టెడు జాలి వారికిపెట్టి పోషించలేదనీ వారికి బెంగకాదు. ఉద్యోగంరాక బెగిలిపోతున్న కొడుకునుచూస్తే వారి పేగులు కదలిపోతాయి. తన బట్టలుతుకుతున్న ఆఫీసర్ [illegible] కాళ్లపట్టుకున్నాడు, మునయ్య కొడుక్కి ఏదైన వుద్యోగం ఇప్పించమని కదిలిస్తే ఏడుస్తది తల్లి -వారి ప్రేమకు దయకు అర్హుడా? తను చదివే రోజుల్లో ఈ ఇంటిని, ఈ తల్లిదండ్రులను చీదరించుకొనేవాడు. సెలవల్లో ఇంటికి వచ్చేవాడుకాదు - తనవెంట వచ్చే స్నేహితుల్ని అక్కడికక్కడే వదిలించుకుని వచ్చేవాడు. ఈ ఇంటిని - ఈ పరిసరాలను చూస్తారని గుండెదడ, ఆప్యాయంగా తనవైపు చూసే తండ్రిని తప్పించుకు తిరిగేవాడు. చదువు నేర్పిన సంస్కారమా అది ?




తన అంతరాత్మకు తెలిసిన తప్పును దిద్దుకునే అవకాశం లేదా? తనూ దిద్దుకునే సంసారం తనకుండదా? కళ్లు మూసుకున్నాడు. చీకటి చిమ్మ చీకటి – మరీ గట్టిగా మూసుకున్నాడు.

చీకట్లలో రంగులు కలగా పులగంగా హరివిల్లులా ఉద్యోగం వెర్రిగా చూస్తూ వెకిలిగ నవుతున్న గోపన్నను చూసి ముసలి తల్లిదండ్రులు నిశ్శబ్దంగ రోదిస్తూ వుండిపోయారు.

---

పార్టీలో ఒక సైక్రియాట్రిస్టు ఒకావిడను యిలా అడిగాడు:

'కెప్టెన్ కుక్ మూడు యాత్రలుచేసి అందులో ఒక యాత్రలో మరణించాడు. ఏ యాత్ర?' దాని కా యిల్లాలు తడబడుతూ—

'నాకు హిస్టరీ బాగారాదు' అంది.